నేటినిజం నేటినిజం నేటినిజం

నమ్మలేని నిజాలు

శివ సాగరం
కెరటాల తాండవం
విప్లవ విల్లు
వగ్గాణి బజ్జీ
కారం మరమరాలు
పేదోపహారం
బంగారు లంక
నేడు మామిడి టెంక
ఉచితాల ఫలం
చితి కర్తృత్వం
కర్మకు ఆడబిడ్డ
కాదు లే చెడ్డ.
తల్లికి ఉరి
పేగుబలికి సరి
మూఢ నమ్మకం

- రేడియమ్
సెల్: 9291527757




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


నేటినిజం నేటినిజం నేటినిజం

శ్రీనిజాలు

ఘన వీరుల చరిత్రలను
పాతాలుగ పెట్టండోయ్ !
శాశ్వత స్వేచ్ఛ కోసమే
ఉద్యమించి పోరండోయ్
ఆత్మ గౌరవానికివే
తొలిమలిదశ ఉద్యమాలు!
మసకబార నియొద్దోయ్
పోరాటం సేద్యమాలు

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 5-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:233 పేజీలు:6 వెల: రూ.1/-

## మాజీ మంత్రి బొత్స సత్యానారాయణకు తీవ్ర అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

విజయనగరం జూన్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' చ నిరసన కార్యక్రమంలో భాగంగా ఆయన విజయనగరం జిల్లా చీపురుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో కార్యకర్తలు ఆయన్ని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆంజనేయపురం నుంచి స్థానిక మూడురోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో బొత్స పాల్గొన్నారు. ఎండవేడి ఎక్కువగా ఉండటంతో ఆయన వడదెబ్బకు గురైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయనకు ఆసుపత్రిలో చికిత్స జరుగుతోందని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.

# సచివాలయంలో క్యాబినెట్ సబ్ కమిటీతో ఉద్యోగ సంఘాల భేటీ..

హైదరాబాద్, జూన్ 4:ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో సెక్రటేరియట్ 6వ ఫ్లోర్ లో ఉద్యోగ జేఏసీ నేతలు భేటీ అయ్యారు. ఇటీవలే క్యాబినెట్ సబ్ కమిటీకి ఉద్యోగుల డిమాండ్లపై రిపోర్ట్ ఇచ్చిన ఐఏఎస్ నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణ భాస్కర్లు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

రేపు క్యాబినెట్‌లో ఉద్యోగ సమస్యలు, పెండింగ్ డిఏలు, ఇతర బకాయిలపై నిర్ణయం తీసుకుంటామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెల్సిందే. ఉద్యోగుల పదవి విరమణ వయస్సు మరో ఏడాది పెంచుతారానీ ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పెండింగ్ డీఏలు, ఇతర డిమాండ్లపై కూడా భట్టి నేతృత్వంలోని కమిటీతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చర్చించనున్నారు. కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి ఏ ఏ అంశాలపై చర్చకు వస్తుందన్నదానిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. ఉద్యోగ సంఘాలు ఇటీవల ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. ఉద్యోగ సంఘాల ఆల్టిమేటంతో దిగివచ్చిన ముఖ్యమంత్రి కేబినెట్‌లో చర్చించి ఉద్యోగులకు సంబంధించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా కొత్తగా ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును ఒక ఏడాది పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఉద్యోగ సంఘాలతో జరుగుతున్న మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో దీనిపై కూడా ప్రధానంగా చర్చించే అవకాశం ఉన్నది.

## మధ్యప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం..
# ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది మృతి



భోపాల్ జూన్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఝబువా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యాన్‌ను ట్రక్కు ఢీకొనడంతో తొమ్మిది మంది చనిపోయారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు కౌంట్ డౌన్ .. వార్డుల విభజనకు నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 4: మున్సిపల్ ఎన్నికలకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కొత్త మున్సిపాలిటీలలో వార్డుల విభజనకు కసరత్తు చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు, 5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి. 7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం అయ్యాయి. కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వార్డుల విభజన ప్రక్రియకు మున్సిపల్ శాఖ అధికారి శ్రీదేవి షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 21 వరకు వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు.

### త్వరలో రిజర్వేషన్లు ఖరారు..

ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితాను తయారు చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. త్వరలో ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా పూర్తికానుంది. అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి కాగానే పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరగనున్నాయి.

పునర్విభజన ఇలా..

కొహిర్, కేసముద్రం, అశ్వరావుపేట, స్టేషన్ ఘనపూర్, మద్దూర్, ఎదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కల్లూరు, అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరగనుంది. మహబూబ్ నగర్, మంచిర్యాల, కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు, నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల్లోనూ కొత్త వార్డులు ఏర్పాటు కానున్నాయి. కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజన తర్వాత జూన్ నెలాఖరు వరకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని భావిస్తోంది..

# తెలుగు రాష్ట్రాలలో కోవిడ్ కలకలం.. రోజు రోజుకి పెరుగుతున్న కేసులు

హైదరాబాద్, జూన్ 4:దేశంలో కోవిడ్ కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. కోవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ. 1. 8. 1, ఎల్‌ఎఫ్. 7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్–కోవ్–2 జీనోమిక్స్ కన్సార్టియం ఇదివరకే వెల్లడించింది. ఇతర దేశాలతో పోలిస్తే.. దేశంలో వైరస్ వ్యాప్తి తక్కువగానే ఉన్నప్పటికీ జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో కరోనా కలకలం రేపుతోంది. కోవిడ్ చాపకింద నీరులా విస్తరిస్తోంది.

### కర్నూల్ జిల్లాలో మరో ఇద్దరికి కోవిడ్..

కర్నూలు జిల్లాలో మరో ఇద్దరికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ప్రొఫెసర్‌కు పరీక్షలు నిర్వహించగా.. కొవిడ్ నిర్ధారణ అయింది. నగరంలోని వెంకటరమణకాలనీకి చెందిన ప్రొఫెసర్ హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. అలాగే మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన 25 ఏళ్ల మహిళ అనారోగ్యంతో వారం రోజుల క్రితం కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. ఆమెకు కరోనా పరీక్షలు చేయగా.. పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆమెకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో మూడు కోవిడ్ కేసులు నమోదు అయ్యాయి.

ప్రత్యేక కొవిడ్ వార్డును ఏర్పాటు చేయాలి..

కరోనా నిర్ధారణ అయిన ఎమ్మిగనూరు మండలం కలుగోట్ల రోగిని పాతగైనిక్ విభాగంలోని కోవిడ్ వార్డుకు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం మళ్లీ ఆ రోగిని వీఐపీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించారు. పాత గైనిక్ విభాగంలోని కోవిడ్ వార్డుకు బాత్‌రూంలు లేకపోవడంతో రోగిని తరలించినట్లు సిబ్బంది చెబుతున్నారు. పాత గైనిక్ విభాగంలో కోవిడ్ వార్డు ఆవరణలో ఫిమేల్ మెడికల్ వార్డులు ఉన్నాయి. అక్కడ మహిళా రోగులు ఉన్నచోట కోవిడ్ వార్డును ఎలా ఏర్పాటు చేస్తారని బంధువులు మండిపడుతున్నారు. రెండు రోజులుగా కోవిడ్ రోగిని అటు ఇటు తిప్పుతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా అధికారులు స్పందించి ప్రత్యేక కోవిడ్ వార్డును అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

### వరంగల్ నగరంలో ఒకే రోజు ఏడు కోవిడ్ కేసులు..

వరంగల్ ఎంజీఎం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తీవ్రమైన దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారికి కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. అలాగే ఎంజీఎం ఆస్పత్రి పీజీ వైద్యురాలికి కూడా కరోనా నిర్ధారణ అయింది. నగరంలో ఒకే రోజు ఏడు పాజిటివ్ కేసులు నమోదుకావడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ విషయంపై వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు స్పందించారు. నగరంలో ఎలాంటి కరోనా కేసులు నమోదు కాలేదని, ఇలాంటి ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని తెలిపారు. కరోనా పట్ల ఎలాంటి ఆందోళన అవసరం లేదని, తాము అప్రమత్తంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

### భయం వద్దు..

కరోనా కొత్త వేరియంట్ పట్ల ప్రజలు భయాందోళనలకు గురి కానవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న రోగులు సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండాలని, ఆయాసం ఉండి జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె, కిడ్నీ, క్యాన్సర్, లివర్ వంటి దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారు మాస్కులు ధరించి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు..

# 5నుండి ఆగస్టు 15వ తారీకు వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

### -బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



హైదరాబాద్ జూన్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారతీయ జనతా పార్టీ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో 11 సంవత్సరాలు అభివృద్ధి సంక్షేమం తో పాటు దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ సమర్థవంత నాయకత్వాన్ని అందిస్తున్న శుభ తరుణంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టాలని జూన్ 9నుండి 18 వరకు భారతీయ జనతా పార్టీ నిర్ణయించినట్లు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. జూన్ 5వ తారీఖు నుండి ఆగస్టు 15వ తారీకు వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కార్యకర్తలందరూ ప్రజలతో మమేకముకు చెట్లు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అందరూ యోగా దినోత్సవం లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.. జూన్ 25న ఎమర్జెన్సీ డే సందర్భంగా తీసుకునే కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించడం కోసం అన్ని జిల్లా లో కార్యాశాలలు నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. అదేవిధంగా జూన్ 6న అన్ని మండల, డివిజన్ లలో పార్టీ కార్యవర్గ సమావేశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది. స్థానిక సమస్యలు పరిష్కారం, పార్టీ కార్యక్రమాలు ఇతర సమస్యలు తదితర వాటిపై చర్చించి కార్యక్రమాలను రూపొందిస్తారని తిలిపారు. జూన్ 7న సోషల్ మీడియాకు సంబంధించిన రాష్ట్ర స్థాయి కార్యాశాల హైదరాబాదులో ఉంటుందని తెలిపారు.

# తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జూన్ 4: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) 2025 పరీక్షల షెడ్యూల్‌ను పాఠశాల విద్యా శాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలు జూన్ 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు షిఫ్ట్‌ల్లో జరగనున్నాయి. పరీక్షలు రెండు పేపర్లుగా పేపర్–1, పేపర్–2 విభజించబడ్డాయి. అభ్యర్థుల సౌలభ్యం కోసం జిల్లాల వారీగా పరీక్షల తేదీలు, సబ్జెక్టులు కేటాయించబడ్డాయి.

పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు మరో షిఫ్ట్‌లో జరుగుతాయి. పేపర్1ను రాయబోయే అభ్యర్థులు, ఐదో తరగతి వరకు బోధించాలనుకునే వారు కాగా, పేపర్–2ను రాయబోయే వారు ఆరో తరగతి పైగా బోధించాలనుకునే అభ్యర్థులు. పేపర్లు ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉండగా, కొన్ని సబ్జెక్టులకు హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ, మరాఠీ, బెంగాలీ, సంస్కృతం మాధ్యమాలకూ అవకాశం కల్పించారు.

జూన్ 18న ప్రారంభమయ్యే టెట్ పరీక్షలు మొదటగా మాథమెటిక్స్ & సైన్స్ (పేపర్–2) పరీక్షతో ప్రారంభమవుతాయి. వరుసగా 16 సెషన్లలో వివిధ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. చివరి రోజైన జూన్ 30న మైనారిటీ భాషల్లో పేపర్–2 మాథమెటిక్స్, సైన్స్ ఢ సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి.

ప్రతి జిల్లాలోని కేంద్రాలను స్పష్టంగా పేర్కొంటూ, సంబంధిత సబ్జెక్టుల పరీక్షలు ఏ తేదీన జరిగేలా కేటాయించారో విద్యార్థులకు వెల్లడించారు. నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, సిరిసిల్ల, మంచిర్యాల, ములుగు, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, జగిత్యాల, పటాన్‌చెరు, సంగారెడ్డి వంటి జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు షెడ్యూల్‌లో తెలిపారు.

ఈ షెడ్యూల్ ప్రకారం పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ జిల్లాకు అనుగుణంగా తేదీలను గమనించి సన్నద్ధం కావాలని అధికారులు సూచించారు. త్వరలో హాల్‌టికెట్లు విడుదల కానుండగా, అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

# హుజురాబాద్ ఏరియా ఆస్పత్రి సమస్యలపై కలెక్టర్ పమేలా సత్పతి ఆరా



కరీంనగర్, జూన్ 4: హుజురాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. . అనంతరం వైద్యసిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు ఎన్ని ఓపీలు చూస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు.

ఆస్పత్రికి వచ్చిన రోగులకు అందుబాటులో వైద్యులు ఉండి చికిత్సలు నిర్వహించాలని చెప్పారు. ఆస్పత్రి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వైద్యుల కొరత, మంచినీటి సమస్యతోపాటు మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తలేరని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.. స్పందించిన కలెక్టర్ చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్ కు తరలించాలని కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

మంచినీటి సమస్య, వైద్యుల కొరతను త్వరలోనే తీరుస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి చంద్రశేఖర్. ఏరియా ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి నారాయణరెడ్డి, వైద్యులు తదితరులు ఉన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి


### –సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్



హైదరాబాద్, జూన్ 4:రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని రుద్రారం, కొమరబండ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల కార్యక్రమంలో పాల్గొని అధికారులతో కలిసి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలు పరిష్కారం కానున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏండీ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, సీఐ కాంతారెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, మాజీ చైర్మన్ బండ మహేందర్‌గౌడ్, గ్రామస్తులు యాదిరెడ్డి, సంజీవరెడ్డి, వేణుగోపాల్, బందయ్య, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.


## అందరికీ ఆత్మీయ ఆహ్వానం




నైజీరియన్ - అమెరికన్ రచయిత్రి
చిమమండా న్గోజి అడిచె
"ఫెమినిస్ట్ మేనిఫెస్టో - ప్రసంగాలు"
పి. సత్యవతి తెలుగు అనువాదం
పరిచయ కార్యక్రమం

తేది : 15 జూన్, 2025
సమయం : సా॥ 6 గ॥లకు
స్థలం : నాగాల్యాండ్స్, సీతారామపురం, విజయవాడ.

ఆత్మీయ వక్తలు : నండూరి రాజగోపాల్ గారు
బండ్ల మాధవరావు గారు
జి. లక్ష్మి గారు
వి. ప్రతిమ గారు
కొండవీటి సత్యవతి గారు
ఆత్మీయ స్పందన : పి. సత్యవతి గారు

★ సాహితీ స్నేహ బృందం, విజయవాడ
★ రుద్రమ ప్రచురణలు, వరంగల్లు



చురక

ఎక్కడి పాటక్కడ
ఎంత ముద్దు పలికేస్తరో
అవకాశవాదంతో
అందంగా కులికేస్తరో
కీర్తి స్వార్థ దాహంలో
కితాబులు వెలవేస్తరో
అధికారంలెవరున్నా
అద్భుతంగా వలవేస్తరో



-వేల్పుల నారాయణ
9440433475



నేటి కందం– నేటికి అందం

ప్రబల్యము తోడుత యువ
శాబకమై గార్బొచేవు సమ్మతి దెలుపన్
నోబెలు బహుమతికి విలువ
పోబడిగా నిలచియుండు భువిలోన ధృతిన్

(5-6-1991 గార్బొచేవ్ నోబెల్ బహుమతిని అంగీకరించిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210


# 'పునాస' ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి




తెలంగాణ ప్రభుత్వం సాహిత్య అకాడమీ సాహిత్య త్రైమాసిక పత్రిక పునాస జానపద పరిశోధక బ్రహ్మ బిరుదురాజు రామరాజు శతజయంతి ప్రత్యేక సంచిక ను రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక సంస్కృతి క శాఖా మంత్రి జూపల్లి కృష్ణా రావు చేతుల మీదుగా మంగళవారం రవీంద్రభారతిలో అవిష్కరించారు. ఈకార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి బాలాచారి ,హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్, వెన్నెల సాహిత్య అకాడమీ , కంజీర సాహిత్య సంస్కృతి క వేదిక అధ్యక్షుడు ముచ్చర్ల దినకర్ ,సోమశిల తిరుపాల్ పాల్గొన్నారు.

# అపోహలొద్దు.. చలామణిలోనే రూ.500 నోట్లు

హైదరాబాద్, జూన్ 4: నోట్ల రద్దు అంటేనే ప్రజల్లో ఒక భయం పుడుతుంది. తాజాగా రూ.500 నోటు రద్దు చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో చాలా మంది ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ఇప్పటికే అన్ని బ్యాంకులకు ఆర్బీబీ కీలక ఆదేశాలు ఇచ్చిందని, బ్యాంకులు తర్వాత రూ.500నోట్ల సరఫరా తగ్గించాలని, ఏటీఎంలలో కూడా రూ.500 తగ్గిస్తూ.. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి అసలు రూ.500 నోటు కనిపించకుండా చేయాలని ఆర్బీఐ బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

దీనిపై ఆర్బీఐ వివరణ ఇచ్చింది.. అన్ని ఏటీఎంలలో 2025 సెప్టెంబర్ 30 నాటికి 75శాతం, 2026 మార్చి 31నాటికి 90శాతం రూ.100 లేదా రూ.200 నోట్లను పంపిణీ చేయాలని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లను ఆదేశించింది

ఆర్బీఐ. రోజువారీ లావాదేవీలకు అధిక డిమాండ్ ఉన్న సాధారణంగా ఉపయోగించే నోట్లను ప్రజలకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నామని ప్రకటించింది.. అంతేకానీ, రూ.500నోట్ల రద్దు ఉండదని పేర్కొంది.

# యాచారంలో రైతు బజార్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హైదరాబాద్, జూన్ 4: రైతు సంక్షేమం కోసం యాచారంలో సకల హంగులతో నూతన రైతు బజార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు క్వాలిటీ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం యాచారంలో రైతు బజార్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు నేరుగా ఇక్కడే అమ్ముకునేందుకు రైతు బజార్ ఉపయోగపడుతుందన్నారు. ఫార్మసిటీనీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఫార్మా కోసం సేకరించిన భూముల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా భూసేకరణ చేపట్టబోమన్నారు. అవసరమైతే రైతుల ఇష్టంతో ఇస్తే ప్రస్తుత ధరను పరిహారం కింద చెల్లిస్తామన్నారు. ఫ్యూచర్ సిటీతో యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు.

అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. మండలాన్ని కూరగాయల హబ్‌గా మార్చనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఆర్డీఓ అనంతరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడిఏ సుజాత, తాహసిల్దార్ అయ్యప్ప, వ్యవసాయ శాఖ ఏవో రవినాథ్, రైతు కమిషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.


ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
వాసా ఫౌండేషన్



ప్రముఖ రచయిత్రి
డా॥ వాసా ప్రభావతి శాస్త్రి జయంతి
సందర్భంగా



ప్రముఖ పద్యకవి, పూర్వ ఉపకులపతి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం
ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారికి
డా॥ వాసా ప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభాపురస్కారం



ప్రముఖ విద్యావేత్త, ఉపకులపతి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం
ఆచార్య సూర్యా ధనంజయ్ గారికి
డా॥ వాసా ప్రభావతి గురుదేవోభవ గురు పురస్కారం - బహూకరణ

తేది: శుక్రవారం 6 జూన్, 2025 సా॥ 5 గంటలకు
శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణ ఐ.ఏ.ఎస్. (రి) పూర్వ సలహాదారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
అధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీ వేత్త
గౌరవ అతిథి : శ్రీమతి శైలజ మిత్ర, ప్రముఖ రచయిత్రి
ఆత్మీయ అతిథులు : శ్రీ గుడిపాటి వెంకటేశ్వర్లు, సంపాదకులు, పాలపిట్ట
శ్రీ పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు, సాహితీ కిరణం

డా॥ వాసా ప్రభావతి స్మారక కవితల, కథల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం
సాంస్కృతిక కార్యక్రమం సా॥ 5 నుండి 6 గంటల వరకు : నృత్య కిన్నెర సమర్పించు కూచిపూడి నృత్య ప్రదర్శన
శ్రీమతి వాసవీ చౌదరి, శ్రీమతి ఎన్. రమ్యవేణి, కుమారి ఆశ్రిత షిండే, కుమారి సహస్ర

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర | మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర | డా॥ వాసా ప్రకాశ్ - జె. మీనాక్షి వ్యవస్థాపకులు, వాసా ఫౌండేషన్

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 5-6-2025

## పున్నా శతకం

అత్యుత్సాహము కూడదు
అత్యుత్సాహము మనిషికి ఆపద దెచ్చున్
అత్యుత్సాహము పెరిగిన
మృత్యువు తోడై నిలుచును సత్యము పున్నా.

చెట్టే ప్రగతికి మూలం
చెట్టును తెగ నరుకువారు చెడిపోవుదురున్
పుట్టిన చెట్టును జూసిన
పుట్టెదు జ్ఞానంబుగల్గు పుడమిన పున్నా.



- పున్నమి
సెల్:92464 10639

## ఘంటారావం

ఒంటిని చూసి
మురిసిపోకు
ఇంటిని
మరచిపోకు.

ఒకరు నాదస్వరమైతే
మరొకరు మృదంగం
ఆలూమగల అనురాగం
సంగీత సంగమం.

పోగొట్టుకున్నానని
పోరాటం ఆపకు
ఓటమి బాటలో
పీఠం వేయకు


మభ్యపెట్టేది
ఎంతసేపు
మబ్బుండేది
కొంతసేపు

పంట
పండనీ
కదుపు
నిండనీ







-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# 'బాపుగారితో నేను'-'బ్నిం'



-జయసూర్య
సెల్: 9440664610








'నన్ను ఇంద్ర ధనస్సుగా మార్చిన ఈ సప్త వర్ణాలకి అంకితం' అంటూ బాపు, ఎమ్మీయల్, శ్రీ రమణ, ముళ్ళపూడి, నవోదయ, బి.వి.ఎస్. శంకులకు వారి ప్రేమానురాగాలు పొందిన 'బ్నిం' ఆత్మీయ కళా హృదయునిగా వినమ్రంగా సమర్పించిన జ్ఞాపకాల దస్తరం ఇది. 'అక్షజ్ఞ' ప్రచురణ సంస్థ ప్రచురించిన ఈ స్మృతి మాధుర్యం, తెలుగు సాహిత్యంలో ఒక అపురూపమైన అక్షర, వర్ణ సముదాయ సమ్మేళనం. మొదటి పలకరింపులోని పులకరింత వరుసలో ఉత్తరార్థాలు వరకు కుంచె, కలం సృష్టించిన కథనం 4 దశాబ్దాలు హృదయంలో నిక్షిప్తం చేసుకొన్న అద్భుత అక్షర సౌందర్యం




కానుకగా, తెలుగు చదువరులకు అందించిన 'బ్నిం' సదా అభినందనీయులు.

తెలుగు భాష రాతకి, దస్తూరికి రేఖకి శాశ్విత హృదయ సౌందర్యాన్ని ప్రసాదించిన 'బాపు' కాలానికి అతీతంగా చిరఃస్మరణీయులు. బాపు పరిచయంతో ఆగిపోకుండా, వారి ఆదర్శంగా ప్రేమానుభూతి పొంది, బుడి బుడి అడుగుల నడకలు నేర్చిన బ్నిం అదృష్టం అరుదు, అపురూపం. అందరికీ దక్కేది కాదు. ఆత్రేయపురం నుంచి భాగ్యనగరం వరకు ఒక కళాకారుని జీవన ప్రస్థానంలో, చెన్న పట్టణం చిరునామా,



అందులో సినీ సమ్మోహిత రమణీయం కలగలుపుగా అందించిన జీవన మాధుర్యం స్పృశిస్తున్న ఈ రచన కేవలం బ్నిం స్వంతం కాదు. ప్రపంచంలో, సీమల కొసల పర్యంతం ఎవరైతే బాపును తలచుకొని పారవశ్యం పొందగలరో వారందరికీ దివ్యమైన అనుభూతి అందిస్తుంది. ఈ అద్భుత సృష్టి రూపకల్పన,

బాపు కేవలం కళా స్రష్ట కాదు. మానవతా విలువలు పరిమళించే, అందర్నీ



ప్రతులకు: అక్షజ్ఞ పబ్లికేషన్స్, 12-11-1364, పరాశర అపార్ట్‌మెంట్స్,2వ అంతస్తు, బౌధనగర్, వారాసీగూడా, సికింద్రాబాద్-500 061.
సెల్: 87127 29057, 8341450673

సంతోష పెట్టాలని, సంతృప్తిగా సుఖ సంతోషాలు అందించాలని జీవితాంతం మథనపడిన సున్నిత హృదయుడు. బాపుగారితో బ్నిం సాన్నిహిత్యం, పూర్వ జన్మపై విశ్వాసం ఉన్న వారికి నిజ సుకృతం.. "యిది బాపు నాకిచ్చిన వేలాది గంటల బంగారాలు! పుస్తకాలు- లక్షల అక్షర కానుకలు- నేను కల బోసుకున్న మధురిమలు" అంటారు.


'బ్నిం'గా సుపరిచితులైన భమిడిపల్లి నరసింహమూర్తి. నేటికీ

> స్పాంటేనియస్‌గా
> జోకులు చెప్పడం
> అందరికీ సాధ్యం కాదు.
> 'బ్నిం'కే చెల్లింది.
> ఆయన వాక్య రచనా శైలి,
> సంభాషణలలో ఎక్కడా కృతకత్యం
> ఉండదు. చక్కటి హాస్యం
> నర్మ గర్భితంగా
> మిళితమై ఉంటుంది.

వారాసీగూడా గృహాశ్రమం నుంచి. బాపు తొలి ఉత్తరం రాసిన 1975 అక్టోబరు 3, తొలి దర్శనం 1978 ఏప్రిల్ 19, 1989 మే 22 మద్రాస్‌లో ఇంటికి వెళ్ళడం, బ్నిం ఇంట్లో ఒక రోజు ఆవకాయ అన్నం, ఎన్నో విశేషాలు. హైదరాబాద్‌లో సినిమాలు తీసిన రోజులలో స్నేహం బలపడింది. బాపు రమణలు బృందం, వారి కార్టూన్ కథల అభిమానులు,

వారందరి ప్రియమైన పత్రిక తెలుగులో వెలువడుతున్న ఏకైక మాసపత్రిక హాస్యానందం, పుట్టిన రోజు సందర్భాలలో హాస్య కథల పోటీలు, ఎన్నో బాపురమణ అకాడమీ నడిపించే పూత రేకుల పండగ, సత్కారాలు ఎన్నెన్నో ప్రతీ పుటలో బాపు రమణల స్మరణ తన్మయింప చేస్తుంది.


'బాపు గారితో నేను' ఒక మెమొరబుల్ జర్నీ, తెలుగులో అసంఖ్యాకునిగా ప్రచురణలు వెలుగు చూస్తున్నాయి. కాని బాపు ప్రేమ పొందిన అదృష్టవంతునిగా 'బ్నిం' మనల్ని కదిలించడం, ఏ శిష్యుడికీ ఏ గురువూ ఏనాడూ ఇవ్వని నిధి నిక్షేపంగా ఈ జ్ఞాపకాలు తెలుగు సాహిత్యంలో గ్రంథస్థం కావటం విశేషాంశం.




స్పాంటేనియస్‌గా జోకులు చెప్పడం అందరికీ సాధ్యం కాదు. 'బ్నిం'కే చెల్లింది. ఆయన వాక్య రచనా శైలి, సంభాషణలలో ఎక్కడా కృతకత్యం ఉండదు. చక్కటి హాస్యం నర్మ గర్భితంగా మిళితమై ఉంటుంది. బాపువంటి ఉన్నత సంస్కారవంతుడైన సునిశిత ప్రతిభావంతున్ని మెప్పించి ఆకట్టుకోవటం, సన్నిహిత భాగ్యం పొందగలగడం, అందమైన అక్షరాలతో రాత, మరింత పరిశింపచేసే కళాకృతులుగా బొమ్మలు, హాస్య గుళికలైన చమత్కార



మేళవింపు 'బాపుగారితో నేను' ఖండాంతరాలలోని తెలుగు ప్రేమికులను కూడా అలరించగల అద్భుత సప్తవర్ణ సంశోభితమణి పేటిక.




# విజ్ఞానదాయకం

ప్రతి ఏటా జనవరి 26వ తేదీన భారత దేశ పౌరులు అత్యుత్సాహంతో జరుపుకునే గణతంత్ర వేడుకల గురించి యువతలో మరింత అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతో వుంది. ముఖ్యంగా విద్యార్థులకు గణతంత్ర దిన ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన బాధ్యత మనందరిదీ. స్వాతంత్ర్య దినం మరియు గణతంత్ర దినం రెండూ ఒకటే అని.. ఆ రెండు రోజుల్లో జాతీయ జెండా ఎగరవేసి.. మిఠాయిలు తిని సెలవు దినాలను ఎంజాయ్ చేయడమే చాలా మంది విద్యార్థులకు తెలిసిన విషయం. ఎంతో మంది పెద్దలు దీనికి మినహాయింపు కాదు.. రాజకీయ నాయకులు కూడా.

భారత దేశంలో రెండు ప్రధాన జాతీయ పండుగలు.. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం మరియు జనవరి 26 గణతంత్ర దినోత్సవం. ఈ రెండు జాతీయ పండుగ రోజుల్లో జెండా ఎగరవేసే విధానం, ఆవిష్కరణల మధ్య తేడా వుంది. 1947 ఆగష్టు 15వ తేది భారత దేశం స్వాతంత్ర్యం పొందిన రోజుగా ఉత్సవం జరుపుకుంటాం. ఈ రోజు భారతదేశం బ్రిటీష్ పాలన నుండి విముక్తి పొందిన రోజు. ఆగష్టు 15న త్రివర్ణ పతాకాన్ని జెండా స్తంభం దిగువ భాగంలోకట్టి పైకి లాగి ఆపై పతాకాన్ని రెప రెప లాడించడం ద్వారా భారతదేశం స్వతంత్ర్యమైందన్న గౌరవాన్ని, సంబరాన్ని తెలియజేస్తాం. ఇది బ్రిటిష్ పాలన నుండి భారత్ స్వతంత్ర దేశంగా అవతరించిందని గుర్తు చేసే ప్రత్యేక పద్ధతి.

1950, జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి రావడంతో ఈ రోజున గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటాం. జెండా ఆవిష్కరణ విధానానికి వస్తే.. జెండాను స్తంభం పై భాగంలో ముందుగానే కట్టి ఆపై ఆవిష్కరింపబడుతుంది. ఇది దేశం ఇప్పటికే స్వతంత్ర దేశమని తెలియజేసే పద్ధతి. గణతంత్ర దిన ప్రాముఖ్యత ఏమిటంటే భారతదేశం ఒక ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మారిందని తెలియజేసే రోజు జనవరి 26. 26 జనవరి రోజున మొదలైన గణతంత్ర సంబురాలు 29 జనవరి రోజుతో ముగుస్తాయి.

భారత రాజ్యాంగం అంటే భారతదేశానికి సర్వోత్కృష్ట చట్టం అన్నమాట. రాజ్యాంగం ద్వారా దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చింది.

1950 సం. 26 జనవరి తేదీన భారత రాజ్యాంగాన్ని అమలు పరిచిన తర్వాత స్వతంత్ర భారతదేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. భారత ప్రభుత్వ నిర్మాణం ఎలా వుండాలి. పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించింది.

శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థల ఏర్పాటు, ఆయా వ్యవస్థల అధికారాలు, బాధ్యతలు.. వాటి మధ్య సమన్వయం ఎలా వుండాలో కూడా రాజ్యాంగం నిర్దేశిస్తోంది. భారత పౌరుల హక్కులు, బాధ్యతలు కూడా సవివరంగా రాజ్యాంగంలో పేర్కొనబడ్డాయి. భారత రాజ్యాంగంలో మొదట్లో ఎనిమిది



ప్రతులకు:
డా॥భీంపల్లి శ్రీకాంత్
8-5-38, టీచర్స్ కాలనీ
మహబూబ్‌నగర్-509 001
సెల్: 9032844017

పుస్తక సమీక్ష

# 'గణతంత్ర మొగ్గలు'

షెడ్యూల్‌లు వుండగా ప్రస్తు తం 12 షెడ్యూల్‌లు వున్నాయి. అంటే నాలుగు సవరణలు జరిగాయన్నమాట.

అంబేద్కర్ మహాశయుడి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద లిఖిత రాజ్యాంగం. రాజ్యాంగం అమలై 2025 జనవరి 26కు సరిగ్గా 75 ఏళ్ళు. భారత రాజ్యాంగ వజ్రో త్సవ సందర్భాన్ని పురస్కరించుకుని 'మొగ్గలు' లఘు కవితా ప్రక్రియ రూపశిల్పి డా॥భీంపల్లి శ్రీకాంత్ గణతంత్ర ప్రాముఖ్యతను వివరిస్తు 'మొగ్గలు' ప్రక్రియలో ఓ చిరు గ్రంథాన్ని వెలువరించారు.

యిది వరలో 'స్వాతంత్ర్య మొగ్గలు' ప్రకటించిన శ్రీకాంత్ యిప్పుడు భారత రాజ్యాంగం యొక్క ఔన్నత్యాన్ని, విశిష్టతను, ఆవశ్యకతను తెలియజేస్తూ శతాధిక గణతంత్ర మొగ్గలను మనముందు వుంచారు.

ఈ లఘు కవితల్లోని కవిత్వాంశ జోలికి వెళ్ళకుండా చదివితే ఎంతో విజ్ఞానాత్మకంగా, ఆలోచనాత్మకంగా మలిచారు. విషయబోధనకు ప్రాధాన్యతనిచ్చారు. భారత రాజ్యాంగం పట్ల, గణతంత్ర దినోత్స వం పట్ల ఓ చక్కటి అవగాహనను కల్పిస్తు సాగిన రచన యిది.

ప్రతి పౌరుడు.. ముఖ్యంగా విద్యార్థులందరు తప్పక చదవాల్సిన పొత్తం 'గణతంత్ర మొగ్గలు'



-రమణ వెలమకన్ని
సెల్: 9866015040

## వృద్ధాప్యం ఒక వరం

వృద్ధులారా నమస్తే!
వృద్ధులకి వృద్ధులంటే కోపం!
పదేళ్ళ క్రిందట నేను కాబోయే వృద్ధుడిని
ఇప్పుడయిపోయా నిజంగా
అందుకే ఇలా అన్నా ధైర్యంగా!
మీకో విషయం చెప్పాలి
నిజం వృద్ధాప్యం ఒక వరం.
ఇప్పటికీ మా పెద్దోడు నడవలేడు నాతో సమంగా
వాడికి మోటరు సైకిలుపై మోజెక్కువ
మా అమ్మాయ పాడలేదు నాతో సమంగా
ఆ కన్నెకు పాశ్చాత్య సంగీతంపై మోజెక్కువ
మా చిన్నోడికి అబద్దాలు చెప్పటు రాదు
అన్నీ నిజాలు చెప్పి తన్నులు తింటూంటాడు
అందుకే కథలు రాయలేడు నాతో సమంగా
మా ఆవిడ వంట బాగా చేస్తున్నాననుకుంటుంది.
ఆవిడ పుట్టింటికి వెళ్ళినప్పుడల్లా
అమృత ప్రాయంగానే వంట చేసుకుంటా
మరి వీటన్నింటికీ కారణం ఏమిటంటారు?
నా శారీరక వయస్సు అరవై అయిదు
నా మానసిక వయస్సు (25)
ఇరవై అయిదే.



-పంకజ మల్లిక్
సెల్:97866065402

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం

# రాష్ట్రం నుంచి ప్రపంచ స్థాయి సాహిత్యం రావాలి- ఎమ్మెల్సీ కవిత



తెలంగాణతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కవిత.



కవి ఘనపురం దేవేందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కవిత, డా॥నాళేశ్వరం శంకరం, డా॥ కాంచనపల్లి, డా॥ చెమన్

తెలంగాణ నుంచి ప్రపంచ స్థాయి సాహిత్యం రావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. తెలంగాణ సాహిత్యం, సంస్కృతి వర్ధిల్లడం ద్వారానే ఈ నేల సమృద్ధిగా ఉంటుందన్నది తెలంగాణ జాగృతి విశ్వాసమని పేర్కొన్నారు. చిన్నారులు బతుకమ్మ పాటలు నేర్చుకోవడం ద్వారా, యువత సాహిత్య రంగంలోకి ప్రవేశించడం ద్వారా కనీసం మరో వందేళ్ల వరకైనా మన సంస్కృతి, సాహిత్యాలు విరాజిల్లుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ ధిక్కార స్వభావం తెలంగాణ కవుల సొంతమని గుర్తు చేశారు. యువ వికాసం పథకానికి శ్రీకాంతాచారి పేరు పెట్టాలన్నందుకు.. సీఎం రేవంత్ ఆ కార్యక్రమాన్నే రద్దు చేసుకొన్నారని మండిపడ్డారు. ఇలాంటి కుట్రలకు వ్యతిరేకంగా కవులు, రచయితలు, కళాకారులు గళమెత్తాలని కోరారు. ఇది ఒక రకంగా తెలంగాణ జాగృతి విజయమని వ్యాఖ్యానించారు. "ఇవాళ మా నాన్న అధికారంలో లేనందున ప్రశ్నించమంటున్నానని అనుకుంటున్నారేమో.! కవులు ఎప్పుడూ ప్రజల పక్షాన ప్రశ్నించాల్సిందే.. అప్పుడే అభివృద్ధి దిశగా సమాజం ముందుకు సాగుతుంది. నా పేరే కవిత. నేనెప్పుడూ ప్రజల పక్షమే ఉంటాను" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్ ఘనపురం దేవేందర్ పర్యవేక్షణలో అతిథులు డా॥ నాళేశ్వరం శంకరం, కోట్ల వేంకటేశ్వర రెడ్డి, చందన్‌రాయ్ డా॥ చమన్, వనపట్ల సుబ్బయ్య, రమేశ్ కార్తీక్ నాయక్, రంఘు నవీన్ చారి, డా॥ కాంచనపల్లి పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో వివిధ జిల్లాలకు చెందిన 55మంది యువతీ, యువకులు తాము రాసిన కవిత్వాన్ని సభలో చదివి వినిపించారు.

ఆహ్వానం



'సినారె' సాహిత్యోత్సవం
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ గౌరవ స్వీకర్త, రాజ్యసభ పూర్వ సభ్యులు
డా. సి. నారాయణరెడ్డి
సాహిత్యం, జ్ఞాపకాలు, అనువాదాలతో ఒకరోజు
జూన్, 07 2025, శనివారం
ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు,
దర్బార్ హాల్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం,
కోఠి, హైదరాబాద్




శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు



సత్కార గ్రహీతలతో డా॥యం.కె.రాము, లంక లక్ష్మీనారాయణ, లోకం కృష్ణయ్య.


# పద్యనాటకోత్సవాలు ప్రారంభం

ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో పద్యనాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు సాగుతాయి. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా స్వామియే అయ్యప్ప నాటకాన్ని ప్రదర్శించారు. కులశేఖర్ రచించిన నాటకానికి సాల్వాచారి దర్శకత్వం వహించారు. బాబురాజు, వెంగమాంబ తదితరులు నటించారు. ఈ సందర్భంగా నటీనటులను సత్కరించిన ప్రముఖ కవి డా॥ ఎం.కే.రాము మాట్లాడుతూ పద్యనాటకాలు ప్రపంచంలో ఒక్క తెలుగువారి సొత్తు అన్నారు. ఈ కార్యక్రమంలో యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, నాట్యగురువు నిర్మలా ప్రభాకర్, సంస్థ వ్యవస్థాపకులు లోకం కృష్ణయ్య, బుర్రా సుబ్రహ్మణ్యం, రమణాచారి పాల్గొన్నారు.

KAVISANGAMAM
the Poetry Space
సీజన్: 2
సీరీస్: 41
తెలుగు శాఖ సౌజన్యం
రెండుతరాల కవిసంగమం
14 జూన్, 2025
రెండవ శనివారం, సా. 6 గంటలకు
సౌజన్యవేదిక:
నిజాం కాలేజి ప్రాంగణం
(రెండవ గేటు ప్రవేశం)
బషీర్ బాగ్, హైదరాబాద్
పాల్గొను కవులు



లక్ష్మీనరసయ్య గుంటూరు
తుల శ్రీనివాస్
రూప రుక్మిణి
జబ్బు వెంకటేష్
చుక్క వంశీ
(నిజాం కాలేజి విద్యార్థి)
BRAHMAM BHAVANA





## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

### నిజపోరాటం

ఆకలిని తీర్చుకోవడానికి
పోరాటం లేకుంటే
కడుపు నిండదు కదా కొంతమందికి
జీవిత నైపుణ్యాలను పెంచుకోవడానికి
విజయాలను దక్కించుకోవడానికి
జీవిత గమ్యాలను చేరుకోవడానికి
బాల్యంలో ఏడవడం అంటే
పోరాటానికి నాందే కదా..
ఇది చేతగాని పోరాటం...
వయసు పెరిగే కొద్దీ నిశ్శబ్ద పోరాటం,
కుచ్చిత పోరాటం,
పోరాటంలో ఓ భాగమే కదా...
రాజకీయ ఆరాటం పోరాటం...
మనుషులకు తెలియనటువంటి
పోరాటాలు
ఏమైనా ఉన్నాయా...
అన్నిటినీ సమయానకూలంగా
ప్రయోగిస్తేనే అనుకున్న గమ్యాన్ని
చేరుకోగలమని విశ్వాసం...
చివరకు ధర్మ బద్ధమైన పోరాటమే
నిజమైన పోరాటం...
ఇది ఇచ్చే సంతృప్తి
గెలుపునుకు మించినది...
హృదయం ఈ గెలుపును,
పోరాటాన్ని శభాష్
అంటూ ఆనందిస్తుంది....

-వేము విజయ్ కుమార్
9491340431.

### తిప్పలు తప్పవు.

అనావృష్టి సంభవించిన కాలంలో
కరువు కాటకాలు ఏర్పడిన తరుణంలో
కాలం కలిసి రాక పైరు ఎండిపోయినప్పుడు
పంట చేతికి రాక వెల వెల పోయినప్పుడు
రైతన్న శ్రమ వృథా - మట్టిలో పోసిన పన్నీరే!
రైతుకు సంబంధిత వ్యవసాయానికి
ఆధారం నీరే!
ఆకలికి అలమటిస్తున్న కాలంలో
అప్పుచేసి పప్పుకూడు తినే తరుణంలో
చేసిన అప్పుతో తప్పవు తిప్పలు!
తీర్చలేని బాధతో అలమటించక తప్పదు!
ఆఇంటి యజమాని పడు మానసిక క్షోభ!
కరువు కాటకాలు ఎవరికీ కావు శోభ!
కష్టాలు నష్టాలు కొన్నాళ్లు
సుఖాలు కొన్నాళ్ళు!
అమావాస్య కొన్నాళ్లు- పౌర్ణమి కొన్నాళ్లు!
అన్నట్లే చీకటి కొన్నా ళ్లు - వెలుగు కొన్నాళ్లు!
అది ప్రకృతి ధర్మం
అనుభవించడం మన కర్మం!

-గూండ్ల నారాయణ
9441678733.

### పుస్తక రహస్యం

చరవాణీలకుసెలవు చీటీ ఇచ్చేసి
దేవాలయం లాంటి
గ్రంథాలయం లోకి
కట్టకట్టుకుని అడుగుపెట్టింది
ఒక విద్యాలయం...
ఒంటరి గదుల్లో మగ్గిపోతున్న
అమ్మమ్మ తాతయ్యల్లాంటి
పాత పుస్తకాలను
పరామర్శించడానికి వచ్చిన
పుస్తక వారసులు వీళ్ళు..
గీతా మకరందమో...రవీంద్ర గీతో..
ఆ పుస్తకంలో వీళ్ళని
ఏ అంశం ఆకట్టుకుందో గానీ
ఆ పసి కళ్ళ లోనీ ఆశ్చర్యాన్ని
ఏ నిఘంటువులు అర్థం చెప్పగలవు.
ఒక పక్క
గురువు సమక్షంలో దీక్షగా పఠనం
మరో పక్క అసంకల్పితంగా
ఆ బాల మునుల చేతి వేళ్ల ముద్రలు..
ఆరాటాన్ని ఆపుకుంటూ
మనసులోనే
గంభీరంగా దాచుకుంటూ
తమ వంతు
ఎప్పుడు వస్తుందా అని
ఎదురుచూస్తూ
వెనుక వరుసలో నిలబడ్డ
బాల స్థిత ప్రజ్ఞులు....
అక్షర సముద్రాన్ని
ఔపోసన పడుతున్న
అగస్త్యులు వీళ్ళు...
జిలుగు వెలుగుల తెర మీద
చదివింది ఎంతైనా
చిటికెలో మాయ మవుతుంది...!
పుస్తకాన్ని చూస్తూ
అక్షరాన్ని స్పృశిస్తూ
కళ్ళ తో చదువుతుంటే
అది మనసులోకి చేరి
ఎన్నటికీ చెరగని ముద్రలా
ఉండిపోతుంది..!!

-భమిడిపాటి వెంకటేశ్వరరావు
72859 51828

### ప్రేమాక్షరాల హారం

నీ మది లోగిలిలో కొలువుండనా
నీ ఆరాధనలో సేదతీరనా
కలకాలం నీతో కలసి నడవనా
పరవశాల ముచ్చట్లు నిత్యం వినిపించనా.
నీ నయనాల్లోకి నేచేరి తిష్టే వేయనా
నీ చెక్కిలిపై కాటుక చుక్క నేనై దిష్టే తీయనా
నీ చెవుల జుంకీలా నేమారి
నీకు అలంకారమవ్వనా
నీ నడకల్లో వెదజల్లే
సుమ గంధాల్నే ఆస్వాదించనా.
నీ స్వరంలోంచి జాలు వారు పాటేనే నేనవుతా
ముల్లున్న దారుల్లో ముద్దబంతి పువ్వులా
నే మారుతా
నీ పెదాలపై విరిసే
చిరు దరహాసానికి కారణం నేనవుతా
నిన్ను చెక్కిన ఆ బ్రహ్మ ఋణం ఎప్పటికైనా
తప్పక తీర్చుకుంటా

-హరిప్రసాద్
9703479099

### ఆక్రోశం

సకలసౌకర్యాలతో సంతోషముగా ఉండాలంటే
కిలకిలారావాలతో
హాయిగా బ్రతకాలంటే
నిత్యకళ్యాణం పచ్చతోరణంగా కళకళలాడాలంటే
క్షణం తీరికలేక ఆనందానికై
పోరాటం చేయాలి
రాయిని సానబెడితేనే
అందమైన వజ్రం
గంధంచెక్కనరగతీస్తేనే సుపరిమళం
కాల్చిపుటం పెడితేనే
మెరియుచు వచ్చు బంగారం
ఏదైనా కష్టపడితేనే శ్రమిస్తేనే ఫలితం
సృష్టిలోని ప్రతిప్రాణి పుట్టడం కోసం
చీకటి చిన్నగుహలో తన్నులాడుకుంటూ..
పుట్టిన వెంటనే ఆకలితోవెదకులాడటం
ఆపై నిలద్రొక్కుకోవడానికి
పరుగుల ఆరాటం..
అందని అందలమెక్కుటకై ప్రయత్నాలు
అందరికంటే ప్రథమంగా
ఉండాలనే తాపత్రయం
ఉన్నదంతా తనకే
సొంతం కావాలన్నా ఆక్రోశం
అందుకే చేస్తున్నాడిక

-ఎం.వి.ఉమారాణి
+91 95814 78722

### నానీలు

చేతికసలే
లేదు ఖాళీ
సెల్లు కట్టేస్తుంది
దాన్ని మోళీ

ఒకప్పుడు
చరవాణి వరం
ఇప్పుడది
వదలని జ్వరం



-తుమ్మూరి రాంమోహన్ రావు
9701522234

పుస్తక సమీక్ష

# బాలల, అభినయ గేయాలు

**చిన్న చిన్న పదాలు, రాగ యుక్తంగా పాడుకునే సౌకర్యం గల, ఈ గేయాల్లో ఎంతో విజ్ఞానాన్ని పొదిగారు కవి చింతల శ్రీనివాస్ గుప్త**

బాలలు అప్పుడే ఎదుగుతోన్న మొక్కల వంటివారు. సత్ప్రవర్తన మంచి నడవడి బాల్యంలోనే నేర్పించితే, రేపు బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి తమను, తమ చుట్టూ ఉన్నవారిని తీర్చిదిద్దుతారు. దేశం సుభిక్షమవుతుంది. సమాజంలో 'మంచి మనిషి'గా ఎదగటానికి సాహిత్యం పాత్ర ఇంతా అంతా కాదు. ఎంతో..

"•Literature has the Power to influence decisions and perspectives " అంటారు ప్రతిష్టాత్మకమైన "బూకర్ పురస్కారా"నికి మొదటి వడపోతకు ఎన్నికైన బాను ముష్తాక్ అనే కన్నడ రచయిత్రి.

బాలలకు వారి వారి మాతృభాషలో అర్థమయ్యే తీరున , బాల సాహిత్యం సృష్టించబడాలి. పిల్లలకు సులువుగా అర్థవయ్యేలా, బాల సాహిత్యం ఉండాలి. పాటలు పద్యాలు, కథలు పిల్లలు బాగా ఇష్టపడుతారు. నీతిని బోధించేలా బాల సాహిత్యం తీర్చి దిద్దబడాలి. ఇటువంటి సాహిత్యం పిల్లలపై చెరగని ముద్ర వేస్తుంది. పరోక్షంగా వారిని మంచి నడవడి వేపు నడిపిస్తుంది. "పిల్లల భావావేశాలను స్కూళ్ళు, లేదా స్కూళ్ళలో పాఠ్యాంశాలు పట్టించుకోవటం లేదు. వీటిని వెలుపలి అంశాలే నిర్ణయిస్తున్నాయి. టెలివిజన్, పాప్ సంగీతం జూదం, ఫుట్‌బాల్, బొమ్మల పత్రి కలు సెన్స్ పత్రికలు పిల్లల భావా వేశాలకు ఉపశమనం కలిగిస్తున్నాయి" అంటారు. స్కాట్‌లాండ్ విద్యా వేత్త ఏ.ఎస్.నీల్.

శతాబ్దం క్రితం నీల్ చెప్పిన ఈ పరిస్థితి ఇప్పుడు మరింత క్లిష్టంగా మారింది. పై వాటికి తోడు ఇప్పుడు కంప్యూటర్లు సెల్‌ఫోన్లు సినిమాలు వంటివి నేటి పిల్లల్ని మరింతగా ప్రభావితం చేస్తున్నాయి. 'ఇంట్లో తలిదండ్రులు గానీ, స్కూళ్ళలో ఉపాధ్యాయులు గానీ పిల్లల అంతరంగిక ప్రపంచాన్ని వాళ్ళ భావావేశాలనూ, ఆలోచనలను పట్టించుకుని, అర్థం చేసుకుని, సరైన మార్గాల్లోనికి మళ్ళించే అవకాశాలు దాదాపుగా కనుమరుగవుతున్నాయి. అంటున్నారు. బాల సాహితీవేత్త, 'పిల్లల లోకం' అధ్యక్షులు డా॥ వి.ఆర్.శర్మగారు , ఈ లోటును పూరించటం ఒక చారిత్రక అని వార్యం అంటారు శర్మగారు.

తెలుగు భాషలో బాల సాహిత్యం దాదాపు మృగ్యమనే చెప్పాలి. ఆర్థిక లేమి, ప్రభుత్వాల అవగాహనా లోపం, ఇందుకు ముఖ్యకారణాలుగా చెప్పవచ్చును.

వేరు తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో బాల సాహిత్య స్పృహ బాగా పెరిగింది. తలిదండ్రులు, ఉపాధ్యాయులు, రచయితలు బాల సాహిత్యం విలువను గుర్తిస్తున్నా రు. బాల సాహిత్య శిక్షణ, వర్క్‌షా పులు విరివిగా నిర్వహించబడుతున్నాయి.

ఒకప్పుడు కొడవటిగంటి లాంటి వారలు మాత్రమే బాల సాహిత్యంపైన దృష్టి పెట్టేవారు. పిల్లల కొరకు సాహిత్యం సృష్టించటం ఒక ఎత్తు అయితే, పిల్లలు తమకు కావల్సిన సాహిత్యాన్ని తామే సృష్టించుకోవటం మరొక మంచి మార్గం. డా॥ పత్తిపాక మోహన్ గరిపల్లి అశోక్ లాంటి ప్రముఖులు బాల సాహిత్య వికాసానికి ఎనలేని







ప్రతులకు: చింతల రజని
1-1-1/250/7ఎ/404
సాహితీప్రణిత్ రెసిడెన్సీ న్యూ హౌసింగ్ బోర్డు రోడ్, నెం.1 వినాయక్‌నగర్,
నిజామాబాద్-503 001.

సేవలందిస్తున్నారు". మన లోకంలోకి వాళ్ళను (పిల్లలను) లాక్కొచ్చే ప్రయత్నం కంటే వాళ్ళ లోకంలోని మనం వెళ్తే బావుంటుంది" అంటారు డా॥ మోహన్.

బాల్యం బాల సాహిత్యం ఈ రెంటిపైన గొప్ప అవగాహన ఉన్న నిజామాబాద్ ఉపాధ్యాయులు మరియు బాల సాహిత్య రచయిత శ్రీ చింతల శ్రీనివాస్ గుప్త. బాల సాహిత్యాభివృద్ధికి ఇతోధికంగా తన సేవ లందిస్తున్నారు. శ్రీ విలాస శతకం వీరి మొదటి రచన. బాల గేయాలు "చిగురింతలు" వీరి రెండవ, అద్వితీయమైన రచన.

తన బాల్యం నుండీ, గానం గేయంపై లోతైన అవగాహన ఉన్న శ్రీనివాస గుప్తగారి ఈ బాల సాహిత్య సంచికలో 100 గేయాలున్నాయి. పిల్లలకు సులభంగా గ్రాహ్యమయ్యే భాషలో పెన్సిల్ బలపం తోట తల్లి సేవ గడియారం, కాగితం, పాలు పెరుగు, గోరుముద్దలు వంటి విషయాలే కాకుండా, పల్లె వెలుగు, బస్సు, ట్రాఫిక్ లైట్లు గాలి, గురువు దేశభక్తి, శతకకర్తలు. ప్రపంచ శాంతి లాంటి విస్తృతమైన విషయాల పైన బాలల అవగాహన పెంచే చిరు ప్రయత్నమే ఈ 'చిగురింతలు'. స్వతః తెలుగు భాషోపాధ్యాయులు కావటం మరియు పజిల్‌లు, చిత్రలేఖనం వంటి కళల్లో కూడా ఆరితేరిన వారు శ్రీ చింతల శ్రీనివాసగుప్త, ఇరవై గేయాలు రాస్తే ఓ పుస్తకం అయిపోతుందన్న సత్సంకల్పంతో మొదలిడిన వీరి ప్రయత్నం ఇరవై, అరవై, దాటి వంద అయ్యాయట! ఓ మంచి ప్రయత్నానికి దైవం కూడా తోడవుతాడని అంటారు. ఇది అక్షరాలా వంద శాతమూ నిజం అనిపించుతుంది వీరి 'చిగురింతలు' చదువుతోంటే! బాల్యంలో రచయిత నానమ్మ, చెల్లెల్ని ఊయెలలో నిద్రపు చ్చే సమయాన ఆశువుగా, ఆ సందర్భాన్ని అన్వయిస్తూ పాటలు పాడటం విని, పరవశించి, తానూ అలానే పాడేందుకు అనుకరించేవాడట! ఆ అభిరుచే దిన దిన ప్రవర్ధమానమై రచయిత చేత 'చిగురింతలు' బాల గేయ సంకలనం వెలయించిందంటారు రచయిత.


చిన్న చిన్న పదాలు, రాగ యుక్తంగా పాడుకునే సౌకర్యం గల, ఈ గేయాల్లో ఎంతో విజ్ఞానాన్ని పొదిగారు కవి చింతల శ్రీనివాస్ గుప్త. పుట్టిన రోజు పండుగ రోజు, సంబరాల్లో భాగంగా మొక్క నాటమంటారు (మొక్క(లు) -పేజీ 57). సుద్దముక్క (చాక్‌పీస్) అమ్మ చేతిలో చేరి ముగ్గు అయింది. నాన్న చేతిలో చేరి పెద్ద లెక్క అయింది. మాష్టారు క్లాసులో వేవేల సంగతులు చెప్పేందుకు పనికి వచ్చింది.

నాకు ఆట వస్తువయింది' అంటారు సుద్ద ముక్క (పే.75)లో. సుమతి శతకం బద్దెన కవి రాసాడని, కుమారి శతకం వేంకట నర్సయ్య రాసాడని వేమన శతకం. కవి వేమన రాసాడని (పే.69) భారతం రాసింది కవిత్రయ మని భాగవతం పోతన అని (పే.68) ఈ చిగురింతలు చదివిన బాలలు తెలుసుకుంటారు. పల్లెటూళ్ళ లో వివిధ వృత్తులను నిర్వహించే కులాల వివరాలు తెలుస్తాయి (పే.47) 1,2,3 (పే.97) పాటతో పిల్లలు 15 అంకెల వరకు గుర్తు పెట్టుకోగలుగుతారు.

**పిల్లల కొరకు సాహిత్యం సృష్టించటం ఒక ఎత్తు అయితే, పిల్లలు తమకు కావల్సిన సాహిత్యాన్ని తామే సృష్టించుకోవటం మరొక మంచి మార్గం.**

గోడకు వేలాడి నంత సేపు క్యాలండర్ దిన వారాలు తెలుపుతుంది. అంతేనా! కాదు, ఫోను నంబర్లు రాసుకునేందుకు, సూదీ దారం గుండు సూదుల్ని గ్రుచ్చుకునేందుకు! అంతే కాదు! సంవత్సరం అయ్యాక పుస్తకాలకు 'పుట్టలు' వేసుకునేందుకు, చెత్తను ఎత్తి పారవేసేం దుకు అంటూ ఎన్నో ఉపయోగాలు వివరిస్తారు రచయిత. ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తోన్న ఈ 'చిగురింతల' రచయిత చింతల శ్రీనివాసగుప్త తీసుకునే క్లాసుల్లోని విద్యార్థులు ఎంతటి అదృష్టవంతులో.. అనిపించుతుంది ఈ బాలగేయాల సంచిక చదువుతోంటే..

పద్యకవి కథకుడు నాటకకర్త బొమ్మలు వేయగలిగిన చిత్రకారుడు, కంప్యూటర్ నిపుణుడు అయిన ఈ రచయిత రాబోయే రచనలు మహాత్మా (ఖండకావ్యం) చింతల శ్రీను శతకం, ఇంకా నామకరణం చేయని కథల సంపుటి నాటికల సంపుటిలు- ఇంకా బావుంటాయని ఆశిస్తూ రచయితను అభినందిద్దాం..



- కూర చిదంబరం
సెల్: 8639338675

# అతివల ఆవేదనకు అద్దం పట్టే నవల 'జగతి'

**-దాస్యం సేనాధిపతి**

అతివల ఆవేదనకు అద్దం పట్టేలా ప్రముఖ కవయిత్రి గౌరోజు అనూశ్రీ జగతి నవలను తీర్చిదిద్దారని ప్రముఖ కవి, విమర్శకులు దాస్యం సేనాధిపతి అన్నారు. జూన్1వ తేదీ ఆదివారం ఉదయం గోదావరిఖని లో ఉదయసాహితి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహింపబడిన



సభలో ప్రసంగిస్తున్న దాస్యం సేనాధిపతి.





పుస్తకావిష్కరణలో అతిథులు

జగతి నవల ఆవిష్కరణ సభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడుతూ జగతి నవలలో దశాబ్దాలుగా స్త్రీల పై చూపబడుతున్న వివక్షను ఎత్తి చూపారని తెలిపారు. ఉద్వేగభరితంగా ఈ నవలలో రచయిత్రి తమ నానమ్మ జగదాంబ (జగతి) జీవితాన్ని ... ఆమె నుండి పొందిన స్ఫూర్తిని గుర్తుకు తెచ్చుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను, బంధాలు, అనుబంధాలను, అనుభవాలను జగతి నవలలో నిక్షిప్తం చేసిన విధానం బాగుందని పేర్కొన్నారు. జగతి,రాజేశ్వరి,పరిమళ, కాంతి తదితర పాత్రలను సృష్టించి కథను ఆసక్తికరంగా మలుస్తూ...నవలను తీర్చిదిద్దారని కొనియాడారు. అతివలపై జరుగుతున్న అఘాయిత్యాలను, అధిగమించడానికి మహిళల్లో స్వాభిమానాన్ని నింపడానికిఆమె నవలలో పొందుపరచిన ఘట్టాలు, సన్నివేశాలుండటం విశేషమని అన్నారు. అయితే ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో పోటీపడుతన్నారని, ఇప్పుడు మహిళల్లో మరింత స్వాభిమానాన్ని, ఆత్మవిశ్వాసం నింపే ఇతివృత్తాలతో నవలలు..ఇతర రచనలు చేయాలని సూచించారు.

నవలా,రచనకు కనీస ప్రమాణాలు పాటిస్తూ, సామాజిక చైతన్యానికి కృషిచేసిన అనూశ్రీ ని అభినందించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉదయసాహితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య మాట్లాడుతూ ఉదయసాహితి పక్షాన నిర్వహింపబడుతున్న వివిధ సాహిత్య కార్యక్రమాలను వివరించారు. నేటికవిత సమూహం ద్వారా రచనా వ్యాసంగంలోకి అడుగిడిన అనూశ్రీ అనతికాలంలోనే వివిధ ప్రక్రియల్లో పుస్తకాలను వెలువరించడం అభినందనీయమని అన్నారు. జగతి నవల ద్వారా మహిళలు ఆత్మస్థైర్యం తో ముందుకు సాగాలన్న మంచి సందేశాన్ని అందజేశారని పేర్కొన్నారు. అనూశ్రీ గారి మాతృమూర్తి పొడిచెట్టి సరస్వతి జగతి నవలను ఆవిష్కరించి మాట్లాడుతూ తమ కూతురు అనూశ్రీ సాహితీరంగాన చేస్తున్న కృషిని చూసి ముగ్ధులవుతున్నామని అన్నారు. రచనారంగంలో మరిన్ని మంచి విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

పుస్తకాన్ని అంకితం తీసుకున్న అనూశ్రీ గారి ఆడపడుచు గాడిపెల్లి రమాదేవి మాట్లాడుతూ అనూశ్రీ మరెన్నో పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. ప్రముఖ కవయిత్రి పెనుగొండ సరసిజ జగతి నవలను పరిచయం చేస్తూ అనూశ్రీ గారి రచనా వైచిత్రిని కొనియాడారు. మహిళలపై వివక్ష మిగతా వేధింపులు కొంతమేరకు ప్రస్తుతం తగ్గినప్పటికీ ఇంకా జరగాల్సింది

ఎంతో ఉందని, దాన్ని రూపుమాపేందుకు రచయిత్రిగా అనూశ్రీ ఎంపిక చేసుకున్న నవలా వస్తువులో జీవం ఉంది..జీవితమూ ఉందనీ..పాత్రల సృష్టిలో ..పాత్రల మధ్య సంభాషణల్లో ...సన్నివేశాల చిత్రణలో అనూశ్రీ తీసుకున్న శ్రద్ధ ప్రశంసనీయమని అన్నారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త, స్నేహసాహితి గ్రంథాలయం వ్యవస్థాపకులు శ్రీ ఏలేశ్వరం వెంకటేశ్ మాట్లాడుతూ మహిళా చైతన్యం కోసం అనూశ్రీ తమ రచనల ద్వారా చేస్తున్న కృషిని కొనియాడారు. పేదవారి బతుకులకు అద్దం పడుతూ నేడు కవులు, రచయితలు పలు రచనలు చేయాలని సూచించారు. మరో ఆత్మీయ అతిథి శ్రీ జే.వి.రాజు మాట్లాడుతూ నవలలో ప్రతి ఘట్టం, ప్రతి పాత్రను సృష్టించడంలో రచయిత్రి అనూశ్రీ గారి ప్రతిభ కానవస్తోందని ప్రశంసించారు. మాజీ కార్పోరేటర్, సామాజిక కార్యకర్త శ్రీ పెంట రాజేష్ మాట్లాడుతూ గోదావరిఖని కి చెందిన అనూశ్రీ గారు రచనారంగంలో దూసుకుపోవడం పట్ల తమ హర్షం ప్రకటించారు.

ఉదయసాహితి రాష్ట్ర సహాయ కార్యదర్శి, సినారె వాగ్భూషణ అవార్డు గ్రహీత శ్రీమతి మేరుగు అనూరాధ స్వాగతం పలికారు.

గ్రంథకర్తను, అతిథులను సభకు పరిచయం చేశారు. అనూశ్రీ ని అభినందిస్తూ ఫర్హాన, కొమురోజు మాధవి, మాచర్ల మల్లేశం, సూర్యదేవర జ్యోతి, తదితరులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఉదయసాహితి సంస్థ పక్షాన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య, వివిధ సాహితీసంస్థల బాధ్యులు, బంధుమిత్రులు గ్రంథకర్త గౌరోజు అనూశ్రీ ని ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో అనూశ్రీ బంధుమిత్రులు, పలువురు కవులు రచయితలు పాల్గొన్నారు.

అతిథుల జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ప్రారంభమైన ఈ సభలో ఆది విజయలక్ష్మి శ్రీనివాస్ ప్రార్థనాగీతం ఆలపించగా...దార స్నేహలత వందన సమర్పణ చేశారు.





నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

### మనబడి

ప్రభుత్వ పాఠశాలలో చదివించవు కానీ
నీ కూతురు మాత్రం ప్రభుత్వ ఉద్యోగి కావాలి
ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకోవు కానీ
నీ కొడుకు మాత్రం అదే ఆసుపత్రిలో వైద్యం చేయాలి
ఇదేమి న్యాయం?
పిల్లలు లేక బడులు మూతపడితే
ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలు ఎందుకు జరుగుతాయి.
మనలో చైతన్యం లేకపోవడం వలనే కార్పొరేట్ దోమలు
మన రక్తాన్ని పిలుస్తున్నాయి
ఐదో తరగతి చదువుకే మన చేత అప్పులు చేయిస్తున్నాయి.
ఇంకా ఎంతకాలం ఇలా మనం పస్తులు ఉండి
కార్పొరేట్ ఆస్తులు పెంచుదాం?
ప్రభుత్వం పరాయిది కాదు ప్రజలది
ప్రజాస్వామ్యం పట్ల పరిజ్ఞానం ఉంటే
ప్రభుత్వం మన ఆధీనంలో ఉంటుంది.
పట్టించుకోకుండా పక్కన పెడితే అదే మనల్ని ఆడిస్తుంది..
ప్రభుత్వ ప్రయోజనాలు పొందడం ప్రజల హక్కు
ప్రజా ప్రతినిధుల చేత
పని చేయించుకోవడం ప్రజల బాధ్యత
పదండి మన హక్కుల్ని కాపాడుకుందాం
మన బాధ్యతల్ని సరిగ్గా నెరవేర్చుదాం
ప్రభుత్వ విద్యా సంస్థలలోనే మన పిల్లల్ని చదివిద్దాం...

-ఆదిత్య కైరం కొండ
8790771348

### మనసిచ్చిన దేవుడు

మనసిచ్చిన దేవుడు
మతిమరుపు ఇచ్చాడు
మనసు మరుపు మాయలు
మాయల మర్మమెరిగిన
మనిషి మహాదేవుడు
చీకటి వెలుగులు ఇచ్చాడు
వెలుగు చూసే కళ్ళు ఇచ్చాడు
చీకటిలో వెలుగు నింపే
చిరు ఆశల దీపం ఇచ్చాడు
పగలు రేయి ల రోజు ఇచ్చాడు
సూర్యచంద్రుల వెలుగిచ్చాడు
మంచి చెడులు ఇచ్చాడు
తెలుసుకునే తెలివిచ్చాడు
ఎండ వానలిచ్చాడు
సేద తీరే తావులిచ్చాడు
చెట్టు చేమలిచ్చాడు
జీవజాలం కు చేయూత ఇచ్చాడు
మోదాలు ఖేదాలు ఇచ్చాడు
భయాలకు అభయాలు ఇచ్చాడు
నీరు నిప్పు ఇచ్చాడు
ఆకలి దప్పులు తీర్చాడు
అన్నీ నీకు ఇచ్చానంటాడు
అజ్ఞానం తొలగించుకోమంటాడు
పుట్టుకలు విమోచనా లు ఇస్తాడు
తానే అవతారమై అవతరిస్తాడు
నీరు పల్ల మెరుగు నిజం దేవుడెరుగు

-పి. బక్కారెడ్డి, 9705315250

### మళ్లీ మనుషుల్లోకి....

అందాల తోవలున్న 'ఆకుపచ్చని ఎడారి' అతడు
అట్టడగు వాళ్ల కోసం అక్షరాలు సంధించే ఉదారి అతడు
ఊహలు ఊసులే కాదు
అతని ఊపిరి సుతా ఆదిలాబాద్ యాసే
మృదుభాషి మౌన ఋషి
కల్మషమెరుగని ఆదివాసీ మనసు అతడు.
తుమ్మ చెట్టూ తెలుసు 'అమ్మ చెట్టు' తెలుసు
మద్ది చెట్ల మౌనాలు వెదురు వేణుగానాలు
కానుగ చెట్ల కబుర్లు,మునగ చెట్ల ముచ్చట్లు తెలుసు
అతనికి
మల్లె,పున్నాగ,పారిజాత పూల గంధము
మిట్టె,కుంటాల జలపాత ధారల అందమూ అతడే
కాగితప్పూల భావాల రసన రాసి
మోదుగుపూల నిరసన చేసి
టేకు చెట్లజాలినికని వేపచెట్ల గాలినిపీల్చి
ప్రపంచ పరిస్థితుల్ని తూకం వేస్తడు అతడు
ఎల్గడికైనా,ఇప్పగాలి కలుషితమై వెల్లడైనా తల్లడిల్లే
వెలుగులపొద్దు
ఐతారం ముచ్చట్ల కోసం
ఎదురుజూచే 'మాపటిపొద్దు' అతడు
ఎల్లకాలం హాయిని,ఆనందాన్ని వొంపుతున్న
వెన్నెల ఆకాశం అతడు
ఎండాకాలం కడుపున చల్లని నీళ్లను నింపుతున్న
ఆదిలాబాదుమట్టి రంజనూ అతడే
చీకటి లోకంలో చిరునవ్వుల వెలుగు సూరీడు
అన్యాయం పై అరిచే ఉద్యమగొంతు అతడు
నటనల నాటకాల కాలలల్లో
అవినీతి ప్రాంతాల అగ్గిబుక్కుతున్ననేలల్లో
నిజం నీళ్ళై ప్రవహిస్తున్న గోదారి అతడు
అమరులకోసం ,అమాయకప్రజల కోసం
అణగారిన జనం కోసం పోరాడుతున్న కలంధారి
అతని తండ్లాట తాత్విక కవితావాక్యాల పూలయి
తోవెంట పూసి చూస్తున్న గుబురు తీగదరి
మానవత్వపు బాటందుకుని సాగుతున్న
ఒంటరిబాటసారి.
అలుపెరుగని అక్షరపోరాటం
కష్టాల కన్నీళ్ల సంపుటం అతడు
గగనమంత తల,ఘనమయిన కల అతడు
ఆరడగుల ఆజానుభావుడు
అద్భుత పదచిత్ర భావకుడు
ఆదిలాబాద్ నిషాని
అరవైయేళ్ల అపారజీవితానుభవంలో
ఎన్నో డక్కాముక్కీలు తిని కనీ
ఎదిగొచ్చి మన ఎదురుంగున్న మహాజ్ఞాని
మట్టి వంటి మానువంటి మనిషి
పిల్లల రేపటి కలలకు రెక్కలు ఇచ్చిన
ఆశ్రమవాసి
ఇమానంగా చెప్తున్న
ఉదారంటే సముద్రం లేనోడు
ఉదారంటే సహనము ఉన్నోడు
సైడ్ పూర్ బడి
ఆవరణ సంబరాలఅరుగుమీంచి
నేడు ఉపాధ్యాయ ఉద్యోగం మాగిపొద్దులా
పొద్దుగూకే యాల్లైంది
అయినా సూర్యుడిలా సార్ వస్తున్నాడు "మళ్ళీ మనుషుల్లోకి".

-రమేశ్ నల్లగొండ
8309452179

### పిల్ల పక్షి పాఠం

గుడ్డులోని పక్షికి
తాను ఆకాశంలో ఎగురుతున్నట్లు మొగులు కల వచ్చింది !
ఈ ఇరుకైన గుడ్డు పెంకుటింట్లో
నేను ఎలా ఎగరగలను
తనను ప్రశ్నించుకుంది
ముక్కుతో గుడ్డు పెంకు తట్టింది !
ఆకాశంగా గుడ్డు తెరుచుకుంది
మొదట " ఎగిరే రెక్కల పక్షి తల్లిని" ఆకాశ మార్గంగా చూసింది !
తరువాత అనంత ఆకాశాన్ని చూసింది !
రెక్కలు యోజనంగా పెంచింది !
గుడ్డులో వచ్చిన కలను
గుడ్డు బయటకు వచ్చి
వెల్లడిగా నిజం చేసుకుంది !
నేను అంతే
అమ్మ కడుపులో
ఉన్నపుడు తాత చదివిన పద్యాలు విన్నాను !
పుట్టినాక విద్యాధికుడినై పద్యం రాసాను !
పిల్లపక్షి పాఠం బోధినిగా నాకు కలం బలం !

- కందాళై రాఘవాచార్య
8790593638

### మురుగునీరు

చిలుక పలుకు లోలె చిరుగాలి విరులోలె
మధురమైన కవిత మదిని జేరు
పరిమళసుమమట్లు ప్రాణహృదయమట్లు
కనుమువినుమురోరి కందుకూరి.

ఎంత మొత్తుకున్న కొంతన్న దరిరారు
కుక్క తోక ఎపుడు చక్క నౌను
మురుగు నీటి బుడగ ముత్యంబు కాదురా
కనుము వినుమురోరి కందుకూరి

-కందుకూరి శ్రీరాములు
సీనియర్ తెలుగు లెక్చరర్
తపస్యడిగ్రీ కాలేజ్
సికింద్రాబాద్
9440119245

